# కడువ సగినం

## —బాలగొండ ఆంజనేయులు

నాగులకట్ట నడిమెద్ద పెండ్లి జేసుకోని సల్లగ కాపరము జేత్తాండాయో లేదోగాని సల్లగ నీడ మాత్రము యిత్తాండాయి రాగిమాను — యాప్మాను.

కట్టమింద నాలుగుపక్కల నాలుగు తావుల బారాకట్టు — పులికట్టు ఆడుతాండారు ఘాడ పిల్లోల్లు — ముసిలోల్లు. యిస్కూలు సదివే అట్లా పిల్లోల్లు యెవురు గెలుత్తారో సూడల్ల అని మోకాల్ల మింద సేతులు వూదపొడుసుకోని వొంగి సూత్తాం డారు. నీడపాట్న సల్లగుందని కుసుండారు యింగా అయిదారు మంది ఆడా—ఆడా.

కట్టమింద వొగతావ యడమకాలు కిందికి దిగ నిడుసుకోని కుడికాలు పైకి మడుసుకోని కుసోని, కుడికాలు కింద పేదుతాండే తాడు మొదలు బిగ దొక్కోని రొండు సేతుల్తో తాడు పేదు తాండాడు సద్దల రామప్ప. యడుమ సెత్తో నారకట్ట పట్టుకోని కుడిసేత్తో నార రోంత రోంత అందిత్తాండాడు గిత్త నర్సిమ్ముడు.

"యేమ్మమా! యిసారీ వాన యగపెట్నట్లేనా" అడిగినాడు గిత్త నర్సిమ్ముడు.

"యేమో! సూత్తాంటే అట్లే వుందయ్యా!" అని మల్లా "వొత్తే యీ పొద్దు రేపులో రావల్లవోయ్" దైర్నెం జెప్పినాడు సద్దల రామప్ప.

"పొద్దన్నాలికె యేంది దిన్నావప్ప. యేందో వొత్తుందంటాండావు" వొచ్చి కట్టమింద కుసుంటా అంటిచ్చుకుందామని నోట్లో పెట్టుకోనుండే బీడి పక్కకు దీసి అడిగినాడు నారాయిన రెడ్డి.

"లేదురా! యీకార్తి అయి పొయ్యేముందన్నా, అయ్యి పోతానే అన్నా వానొచ్చి తీరల్ల" అనె సద్ద లామప్ప.

"యేమో మమ! నిన్న సమ్మచ్చరము యిట్లా ప్పటికి యిత్తన మన్నా యేసింటిమి. యిసారి అదిగుడా లేకపాయ" అనె నర్సిమ్ముడు.

"యీల్లు యీ పకారంగ బారకట్టు — వులిజి త్తుము ఆడుతాంటే యీ వానొత్తుందప్పా! దినాము సెప్పినా సీతకు రాముడేమిగా వల్లంటారు. ఆడ ద్దంద్రాని సెప్పి సెప్పి సాలయి తాంది.

యీల్లు బతికే నా కొడుకులయితే గదా మాటి నేది" అనె నారాయిన రొడ్డి.

"తలకాయికి సెప్పలడిగే వోల్లకు ఎవుర్జెప్తా రయ్యా" అనె వుండబట్టుకోలేక బయన్నగారి లచ్చు మన్న.

"సూడప్ప! అదురుట్టానికి యీనం లేదు గుడ్డి కంటికి సూపు లేదంట. యేందాడినా పై నుండే వోడు వొగడు కన్నుదెరిత్తే వొచ్చేవాన యెనిక్కి బోడులేప్పా!" అనె పులికట్టు ఆడేవోల్లలో వొగడు.

"యేంది కన్ను దెరుత్తాడో యేమో! యీడ పానాలు బోతాండాయి" అనె బేజారుగ బయన్న గారి లచ్చుమన్న కాల్లో ముల్లు మల్లి ముల్లుతో గెదిరిచ్చుకుంట.

"పుట్టిచ్చినోడు పత్తులు పెడతాడావోయ్. యిసారి వాన తప్పకుండ వొత్తాది" గెట్టిగ జెప్పె సద్దలామప్ప.


'ఊనంట మమా! దారం సాములోరు మొన్న గుల్లో పంచాంగం సదివి సెప్పినాడు. యిసారి యర్ల నేల్లు బాగా పండుతాయంట. సెనిక్కాయి కేమి బయిం లేదంట" అనె మల్లా ఏందో గ్యాపకము దెచ్చుకున్నట్ల బయన్నగారి లచ్చుమన్న.

"అవురా! నర్సిమ్మగా! మొన్న అక్కమ్మగారికి పొయ్యిం[డంట యేం జెప్పినారు" బనీసు జోబిలో వక్కాకు తిత్తి బయిటికి తీత్తా అడిగినాడు జోగి నారప్ప.

'అబ్బా! యాల్జెప్పల్ల పోమమా! వంకాయిల్లచ్చి మన్న వూజిచ్చేదంకా లెయ్యనని వొగటే పట్టుబట్టి కుసుంటే వురుం కొట్టికొట్టి వురములోనికే సొలయి పాయిననుకో. కడాలాట్టుకు! యేడు మంది అక్కయ్యగారిలో నట్టినడిమెద్దుండే ఆయమ్మ, ఆ యమ్మకు యడమ పక్కనుండే ఆయమ్మ నిమ్మ కాయి పూలు కుడి పక్కకు యిసిరి పారేసిపో" అనె నర్సిమ్ముడు రోంత రోంత మెగములో నగువు దెచ్చుకుంట, అక్కమ్మగారు వూజిచ్చినంక వానరాక పోతుందా అన్నెట్ల.

"యేందప్పా! బోలు మాట్లాడుతాండారు" వాన అనే మాట యినవడతానే వూరి ముందర మడికె






ట్లలోకి కాలుమడిసేకి పొయ్యేవోడు కట్టదగ్గిరికొచ్చి అడిగినాడు గొంగటో బులప్ప.

"అవునప్పా! అడిగేది మర్సేపోతి, మీవోడు పెద్ద ప్పయ్య కొడుకు నారాయిన రొడ్డిగానికి వొంటి కొండ అక్కమ్మగారు పయ్యిలోకొచ్చి యేందో చెప్పి నాడంటనే" అడిగినాడు నర్సిమ్ముడు.

"యేమోనప్పా! నేనేమి కండ్లతో సూల్లేదు. అను కుంటాంటే యినిందే. యిసారి వాన్లు బాగ కురుత్తాయని సెప్పినాడంట. అదెంత నిజమో, ఎంత అపద్దమో ఆపై మండేవోనికే తెల్సల్ల" అనె నడినెత్తిమింద జుట్టు వూడ బీక్కోని మల్లా బిగి చ్చుకుంట గొంగటోబులప్ప.

"యీడు జెప్పొద్దుగాని అన్నా! మా నేలకోటి గాడప్పా! వానికి గొర్లకుంట్లో నర్సిమ్ముడు పయ్యి లోకొత్తే కరెట్టుగా సెప్పతాండే. వారం దినాల్లో వానొత్తుందన్జెప్పితే వొచ్చి తీరాల్సిందే! పొప్మ సచ్చియాలోకానుండాడో" అనె బాదగా యేకిలి యర్రాయప్ప కొడుకు అంజినెయులు.

"యేమోనప్పా! మెన్న రొండు సినుకులు పన్నాయి వొచ్చే సూచినే కనపడతాంది!" అనె జోగినారప్ప.

'ఆ! అదేం వానప్ప. మంగలోడు గుండు గొట్టేకి తలకాయి మింద నీల్లు సిలకరి చ్చినట్ల అదీ వానేనా?" అనె జంగమప్ప కొడుకు పెద్ద గురప్ప సిగిరెట్టు దమ్ములాగి బయిటికిదుల్తా.

"సూడప్పా! వాన పట్టేకేమో పడతాంది గాని వొంగి రాలె" అనె నారాయిన రొడ్డి.

"రొండు సినుకులు పన్నాయి గదా! యీ పొద్దు గాకుంటే రేపన్నా వానొచ్చి తీరల్ల" అని కాలు మడిసేకి పొయ పూరి ముందర మదికెట్లలోకి గొంగటోబులప్ప.

ముందు సమ్మచ్చరము ముంగారు వాన్లు పడ తానే రైతులంతా సేద్దెల్జేసుకోని అదునుకు వాన పడతానే యిత్తనాలు యిత్తుకుండ్రి. మద్దెలో వగటి రొండు వాన్లు గూడా కురిసె. కురిత్తే మాత్రము యేం లాబ్మ? తీరా నోటి కాడికొచ్చే తప్పడు సెడగొట్టే దేవుడు. బాగా పూతబూసి పూడలు దిగి సీరు బుడ్లు పన్నెంక వానయగ పెట్టె. సెట్టుకు రొండూ – మూడు బలిసింటే ' అడపాదడపా యిత్తనం కాయి తిరిగింది. పొయ్యినొల్లవి అసలే పొయ్యినాయి.

యిసారన్నా బాగా వాన్లు పడతాయేమో యిత్తనం యేద్దామని అందరు యిత్తానాలు వొల్సి రెడీగా పెట్టుకుండారు. యిత్తనం కాయిలు లేనోల్లు దరమారం బొయ్యి సెనిక్కాయిల మిసన్లల్లో దగ్గిర




ఉబ్బసం వ్యాధికి ప్రత్యేక చికిత్స! నూతన యవ్వనం పొందండి! సంతానవంతులుకండి!
చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి!!!

హస్త ప్రయోగము వలన కలిగిన నరముల బలహీనత, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి, దాంపత్య సుఖం లేకపోవుట, సంతానము లేకపోవుట, సొరియాసిస్, తెలుపు (బొల్లి), నలుపు, ఎరుపు మచ్చలు, రసిపుండ్లు, సుఖ సంబంధమైన వ్యాధులు, ఫెస్టులా స్త్రీల కుసుమ వ్యాధులకు, చర్మవ్యాధులకు లైంగిక సమస్యలకు చికిత్స చేయబడును. పోస్టుద్వారా కూడా చికిత్స కలదు.

క్యాంపులు

ప్రతి నెల 1, 16 తేదీలలో రాజమండ్రి, హోటల్ అశోకా, కోటగుమ్మం వద్ద.
ప్రతినెల 2, 17 తేదీలలో కాకినాడ, వీనస్ ఎ.సి. లాడ్జి, కల్పనా టాకీస్‌వద్ద.
ప్రతి నెల 6, 21 తేదీలలో భీమవరం, షణ్ముఖ లాడ్జి
ప్రతినెల 9వ తేదీన ఒంగోలు, హోటల్ పూర్ణిమ, బస్టాండ్ వద్ద.
ప్రతి నెల 10వ తేదీన నెల్లూరు, హోటల్ చిన్నీ ఇంటర్నేషనల్, గాంధీబొమ్మ సెంటర్.
ప్రతి నెల 25వ తేదీన ఖమ్మం, హోటల్ కిన్నెర ఎ.సి., బస్టాండ్ వద్ద.
ప్రతి నెల 26వ తేదీన కొత్తగూడెం, హోటల్ లేపాక్షి

ప్రతి క్యాంపులోనూ ఉ. గం. 10-00 నుండి రాత్రి గం. 10-00 వరకు పై క్యాంపు తేదీలు మినహా మిగిలిన రోజుల్లో డాక్టరుగారు గుడివాడ క్లినిక్‌లో వుంటారు.

40 సం.ల గొప్ప అనుభవంగల ఆయుర్వేద అలంకార

డా. డి. మార్కండేయులు సెక్స్ & స్కిన్ వ్యాధులకు అనువంశిక ఆయుర్వేద నిపుణులు

పార్కు రోడ్, గుడివాడ – 1. ఫోన్స్: 2522 & 2540

యిసారి పంట పండితే వాల్లకీ యేత్తామజ్జెప్పి అప్పకింత యిత్తనం కాయిల్లెచ్చుకోని వొల్పి పెట్టుకుండారు. యట్లయితే అట్ల యితుందని వొట్టి సేండ్లే సెద్దేలు సేసి పెట్టుకుండారు. రొండు సిసుకులు పడితే యిత్తనాలు మన్నులో వూడ్సి పెడితే యట్లన్నా అయితుందని. వాన కోసరము ఎదురు సూత్తాండారు. ఆ దేవుడేమి జేత్తాడో సూడల్ల!

వారం దినాల కిందట ఆడ ముత్తాయిదువులొచ్చి బుడ్రాతికి నూటొక్క కడవల నీల్లు బోసిరి. పద్దినాల కిందట మైలేపల్లి బొమ్మలాటోల్లను 'లిపిచ్చి తోలు బొమ్మలాట ఆడిచ్చిరి. యింగ గుల్లో దినాము యిరాటవురం సదివిత్తానే వుండారు. మొన్నయింటి కొగరు పొయ్యి సెరువు మరవలో పక్క నూరోల్లు యేసిపోయిన తూటురోలు, పాత యిస్సర్రాల్లు పొలిమేర దాటిచ్చి, పొలిమేర దేవరగూడా సేసుకోనొచ్చి నారు. యేంది జేసినా వాన వొంగకుండా వుంది. పట్టినట్ల పట్టి యెగిరిపోతాంది. గాలికి పెట్టుకుంది.

అదీ యిది మాట్లాడుతా వున్నెట్లనే మాదిగోల్ల తప్పిటి వాయించినట్ల యినపడింది. ఆ సబదం సెవుల్లో పడతానే కట్ట మిందుండే వాల్లందిరికి నరాలు పీకినట్లయినాది.

"మ.మా! నాగ సంద్రం నుండి మాదిగోల్లొచ్చినట్లుండారు'' అనె నర్సిమ్ముడు.

అక్కడుండే పిల్లోల్లు పెద్దోల్లు బారా కట్టు – వులి కట్టు ఆడేది యిడ్సి పెట్టి రాంసామి గుడి దగ్గిరికి వురుకోవురుకు కడవ సగినం సూసేకి.

"మల్లా పేదుదాం పదవోయ్ మనం బోదాం" అని పేదుతాండే తాదు పక్కకేసి లేసినాడు సద్దలామప్ప. ఆడ కుసోనుండే వోల్లు అందరూ టువ్వాల్లు యిదిరిచ్చి బుజమ్మింద యేసుకోని నువు ముందా? నేనుముందా? అన్నేట్ల రాంసామి గుడి దగ్గిరికి నడ్సబట్రి.

వాల్లంతా ఆటికి వొచ్చే తలికే అంతా రెడీ అయినట్లుంది. తప్పెటోల్ల కోసరమే యియ్యాల్దంకా యెదురు సూసినట్లుంది. నేసే పక్కీరప్ప పాతింటి ముందర వొరిగెడ్డి కంది కట్టి అంటిచ్చి తప్పెట్లు స్యాకము సూపిత్తా కావుతాండారు మాదిగోల్లు.

అప్పడే ఆడోల్లు,మగోల్లు, పిల్లోల్లు, పెద్దోలు అంతా వొచ్చి సుట్టూర సుట్టుకుండారు.

పరమట సంజప్ప, నేసేకిట్టప్ప పిల్లోల్లను ఆడోల్లను గదురుకుంటాండారు దూరం జరగమని. యెంత జెప్పినా యిన్నట్ల వొగరి మింద వొగరు పడతా యేం జరుగుతోందని సూత్తాండారు జనం.

రాంసామి గుడి ముందర ఆవు ప్యాడతో అలికి ముగ్గేసినారు. ముగ్గు నడిమెద్ద అయిదారు సేర్లు రాగులు పోసినారు. రాగుల నడిమెద్ద నిలసేట్ల కొత్త విందు కడవ పెట్టినారు కుదురగ. యెదిగే వొయిపొచ్చినట్ల ముగ్గురు ఆడపిల్లోల్లు వూరి ముందర దొరువులో మునిగొచ్చినారు. ఆ ముగ్గరూ కడవకు మూడు పక్కల వొంగి వాల్ల కుడిసెయ్యి సూవుడేల్లతో కడవ కంటమ్మింద అనిచ్చి పట్టుకుండారు. "గెట్టిగ పట్టుకోద్దండ్రి, సల్లుగా పట్టుకోండ్రి'' అని తెల్సిన పెద్దమనుసులు సెప్తాండారు! సరే అన్నెట్ల తలకాయి లాడిచ్చి ఆ ముగ్గురు ఆడపిల్లోల్లు అట్లే అనిచ్చి పట్టుకుండారు.

''యింగ కానియ్యండ్రి'' అన్నెట్ల మాదిగోల్ల పక్క సైగు సేసినాదు పరమట సంజప్ప. వొత్తా వొత్తా తలా నాలుగైదు ముంతల కల్లు యిగ్గొచ్చినట్లుండారు. యాల్జెప్పల్ల పో నా యాల్లు సంపుతాండారు. వాల్లు వాంచే వాంచడానికి తప్పెట్లే పగిలి పోతాయేమో అన్నేట్లుంది. వాల్లు కొట్టే కొట్టడానికి నరాలు తెగినట్లయ్యి యెవుడో 'సీటి కొట్టినాదు. "లేయ్! యెవుడరా సీటేలు కొట్టద్దండ్రి'' అని గదురుకుండె గొంగటోబులప్ప.

అందరి సూవులు కడమిందే వుండాయి. తొంగి తొంగి సూసేవోల్లు – మింద పడి సూసేవోల్లు – మిద్దె లెక్కి సూసేవోల్లు. కడవ కుడి పక్కకు తిరిగీనా, నీల్లు తొలికీనా, అది వాల్ల సూవుల్లో ఆశ!

గుడి ముందర మెటుకుల దగ్గిర కుసోని పయ్యి మింద దద్దులు నీకుంటా కడవ పక్కనే సూత్తాండాదు బూమన్న గారి రామప్ప. వూది కడ్డీ అంటిచ్చేకి తీసిన అగ్గి పెట్టి బనీను జోబిలో యేసుకోని సల్లడం మోకాల పైకి మడుకుంట కడవ పక్కనే సూత్తాండాదు నారాయినప్ప. కోట్లో నర్సిమ్మప్ప పందోల్ల పిన్నెంగట్రాముదు యెవురికి యినపన్నట్ల.

"యెవురు కనిపెట్నారో మంచిది కనిపెట్నారప్ప"

"యేందో అంతా మన్సల్ని మోసం జేసేకి కింద రాగులు బోసినారు. కడవ యాదో పక్కకు తిరక్కుండ వుంటుందా? తిక్కనాయల్లు''

"అట్ల నద్దన్నా! నిన్న సమ్మచ్చరము యిదే సగినం బుక్క పట్నంలో పెట్టిండ్రంట. కరెట్టుగా జరిగిందంట. నిన్న సమ్మచ్చరము ఆ పక్కన మంచి వానగదా!''

'యేమోనప్పా! నేన్నేమ్మలే! సెందాలొసుల్జేసుకోని తినేకి యీ పన్జేసినారేమో అనుకుంటాండా!"

''సన్నగప్పా! వాల్లకిన పడీని''

"ఆ! యినపడితే యినపడన్లే నన్నేమి జేత్తారు"

"పది మందిలో బాగుండదన్నా''

"లేకుంటే యింటికి పది రూపాయిలా సందాయేసేది"

''యేమో లేప్పా! వాల్లపాప్మలో వాల్లే బోతారు'' అని సన్నగ మాట్లాడుతా కడవ పక్కనే సూత్తాండారు.

వాల్ల కెదురగ్గా కుసోనుండే కురవ కుల్లాయప్ప యేంది పట్నట్ల కడవమి దేసంతా పెట్టి "రామ! పరమాత్మా శివశివ, అమ్మ పెద్దమ్మా, సుంకలమ్మ" అని అన్ని దేవర్లను తలుత్తాండాడు. కడవ యా పక్కకు తిరుగుతాందో, యిసారి వానేమి జేత్తుందో అని. యింగ మిగతావోల్లు యెవురి సేతనయినట్ల వాల్లు యిరగబడి సూత్తాంటే గిత్తనర్సిమ్ముడు యెత్తుసాలక మన్సుల సందులో దూరి సూత్తాండాడు.

కడవ యాపక్కకు తిరుగుతుందో ఆ సూసే వాల్లకే తెలియల్ల!

---

## అర్థవంతమైన అచ్చుతప్పు

ఓ మారు, మధునాపంతుల వారికి, ఆయన వ్రాసిన 'ఆంధ్రపురాణం' కారణంగా కోలంకలో భారీ ఎత్తున సన్మానం జరిగింది. ఆ సభకి భమిడిపాటి వారు హాజరు కావలసిందే – కాని ఆయన షష్ఠి పూర్తి ఉత్సవం దగ్గర్లో వుండడంవల్ల ఆయన రారు అని ముందే రూఢి అయిపోయింది. జమ్ములమడక, వేదులవంటి హేమా హేమీల ఉపన్యాసాలు అయి పోయాయి. సభకి అధ్యక్షత వహించిన శ్రీ కాటూరి వెంకటేశ్వర రావుగారు తమ తొలి పలుకుల్లో 'భమిడిపాటి వారు కూడా వస్తే బాగుండి వుండేది' అన్నారు. సభ్యుల వెనకాల జనం మధ్య నుంచున్న భమిడిపాటి వారు "నేను వచ్చాను'' అన్నారు. సభ సంభ్రమాశ్చర్యాలతో నిండి పోయింది. వేదిక మీదకి రమ్మనీ ఏదైనా మాట్లాడమనీ అంతా వత్తిడి చేశారు. బెట్టుగా వేదిక మీదకి వచ్చి సీరియస్‌గా ముఖం పెట్టి "అందరూ అద్భుతంగా మాట్లాడారు. అయితే, ఆహ్వానపత్రంలో అచ్చు తప్పు పడింది. అంతా దిద్దుకోండి. ఆయన ఇంటి పేరు 'మధునాపంతు' కాదు. మధు నా పంతు, ఇదీ విషయం – శలవు'' అని కూర్చున్నారు. సభాప్రాంగణం చప్పట్లతో మారుమ్రోగి పోయింది.

–పోలాప్రగడ